క్లుప్తంగా

కొల్లూరులో పశు వైద్యశిబిరం



కొల్లూరు: పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని పశువులకు అవసరమైన వైద్య సేవలను అందించడానికి పశుపోషకులు తోడ్పాటును అందించాలని పశువైద్యాధికారి బి.యశ్వంత్ అన్నారు. శనివారం కొల్లూరు పశు వైద్యశాలలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ పాల్గొని జీవాలకు నట్టల మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశారు.

తిరునాళ్ల నిర్వహణపై సమీక్ష

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్లపై ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులచే సమీక్షా సమావేశం నిర్వహించనున్నామని ఆలయ ఈఓ డి.వెంకటప్పలాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో అధికారులు పాల్గొనాలని కోరారు.

ఆటో బోల్తాపడి వ్యక్తికి గాయాలు



కొల్లూరు: ఆటో బోల్తాపడి డ్రైవర్ గాయాలకు గురైన సంఘటన మండలంలోని ఈపూరు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వేమూరు మండలం చంపాడుకు చెందిన పీతా సురేష్ తన భార్యను తీసుకొని వెళ్లేందుకు మండలంలోని ఈపూరు ఆటోలో వెళుతున్నాడు. ఈపూరు సమీపంలో ఆటో అదుపుకోల్పోయి పల్టీ కొట్టడంతో ఆటో నడుపుతున్న సురేష్ గాయాల బారిన పడ్డాడు. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు వెంటనే అప్రమత్తమై 108 వాహనం ద్వారా క్షతగాత్రుడ్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉత్తమ ఏఈఆర్ఓగా వేమూరు తహసీల్దార్ సుశీల



వేమూరు: ఓటర్ల నమోదు ప్రక్రియలో తాను చేసిన సేవను ప్రభుత్వం గుర్తించి ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఏఈఆర్ఓ) అవార్డును అందజేసిందని వేమూరు మండల తహసీల్దార్ సుశీల తెలిపారు. బాపట్ల జిల్లా కార్యాలయంలో జిల్లా కలెక్టరు వెంకట మురళీ చేతులమీదుగా శనివారం అవార్డు అందుకున్నానని తెలిపారు. వేమూరు నియోజకవర్గంలో ఓట్లు నమోదు, తొలగింపు కార్యక్రమంలో అధికారులు శ్రద్ధగా పని చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విభాగం కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వి శ్రీనివాసరావు, 104 పోలింగ్ స్టేషన్ బూత్ లెవల్ అధికారి ఇ.పవిత్ర ఉత్తమ అవార్డు, ప్రశంసాపత్రాలు అందుకున్నారని ఆమె తెలిపారు.

బీఎల్ఓలకు ఉత్తమ అవార్డులు అందజేత



చుండూరు(వేమూరు): బూత్ లెవల్ అధికారుల సేవలను ప్రభుత్వం గుర్తించి ఉత్తమ అవార్డులు అందజేయడం జరిగిందని చుండూరు తహసీల్దారు నాగరాజు తెలిపారు. మండలంలోని కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో 43 మంది పోలింగ్ బూత్ లెవల్ అధికారులకు శనివారం అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

నగరం: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన హోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ జరిగిన ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. పూజాకార్యక్రమంలో నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సామాజిక మార్పునకు ఓటుహక్కు కీలకం

- కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు
- వాడవాడలో ఓటు హక్కు అవగాహన ర్యాలీలు



కొల్లూరులో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు, అధికారులు

కొల్లూరు: ఓటుహక్కు సామాజిక మార్పునకు కీలకమైనదని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకొని సమాజాభివృద్ధికి దోహదపడే నాయకులను పారదర్శకంగా ఎన్నుకోవాలని సూచించారు. యువత తప్పనిసరిగా ఓటు హక్కుకు అర్హత పొందిన వెంటనే నమోదు చేసుకొని ఓటు హక్కును పొందాలని సూచించారు. ఈసందర్భంగా స్థానిక బీఆర్‌కే శాస్త్రీ ఐటీఐ కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రేపల్లెలో...

రేపల్లె రూరల్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని మహిత జూనియర్ కళాశాల విద్యార్థులచే శనివారం ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుల, మత, లింగ వివక్ష లేకుండా రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిందన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని, ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించే, నిస్వార్థంగా పని చేసే నాయకుడి ఎన్నికునేందుకు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి థియేటర్ సెంటరులో విద్యార్థులచే ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేసే ప్రతిజ్ఞ చేయించారు.

పలువురికి ప్రశంసా పత్రాలు ..

18 సంవత్సరాలు నిండిన పలువురిని గుర్తించి నూతనంగా ఓటుకై దరఖాస్తు చేసుకునేలా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పలువురు పట్టుభద్రులు ఓటు హక్కు దరఖాస్తు చేసుకునేలా పనిచేయటంతో పాటు విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా మెలిగిన బేతపూడి వీఆర్వో అట్లూరి వెంకటేశ్వరరావుకు ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ప్రసంశాపత్రాన్ని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావులు అందజేశారు. ఎన్నికల్లో పలుమార్లు ఓటు హక్కును వినియోగించుకున్న పలువురు మహిళలను సత్కరించారు. విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్ఐ పి.రాంబాబు, శానిటరీ ఇనిస్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, బూత్‌లెవల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో..

వేమూరు: ఓటు ఒక్క వజ్రాయుధం వంటిదని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం నిర్వహించారు. వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ పురవేదిక వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. జొన్నలగడ్డ విజయబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత...

బాపట్ల: ఓటు హక్కును ప్రతి ఒక్కరు బాధ్యతతో వినియోగించుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం కళాశాలలో శనివారం జరిగింది. ఈసందర్భంగా డీన్ ఎం.సర్దార్‌బేగ్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా, ఓటింగ్‌తో వచ్చే శక్తి మరియు అధికారాలను మనం అర్థం చేసుకోవడం చాలా అవసరమన్నారు. ఓటు వేయడం అనేది కేవలం హక్కు మాత్రమే కాదు, మనం గౌరవించే ప్రజాస్వామ్య విలువలు వర్ధిల్లేందుకు మనందరం తప్పక నెరవేర్చాల్సిన బాధ్యతగా ఉందన్నారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇ.గౌతమి ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ సిహెచ్ సోమేశ్వరరావు, డాక్టర్ ఎస్.బ్లెస్సీ సాగర్, డాక్టర్ వై.అరుణ కుమారి, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ వై.ఫణీంద్ర కుమార్ ఉన్నారు.

అమర్తలూరులో...

అమర్తలూరు(వేమూరు): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు అధిక ప్రాధాన్యముంటుందని తహసీల్దార్ నెహ్రూ బాబు అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు పొందాలని ఆయన కోరారు. డీటీ శివయ్య, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు



వేమూరులో మానవహారం నిర్వహించిన విద్యార్థులు

వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయం పరిశీలన



పార్టీ నూతన కార్యాలయాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె రూరల్: పట్టణంలో నూతనంగా నెలకొల్పిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతం అయ్యేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండేందుకు పట్టణంలో నూతన కార్యాలయాన్ని నెలకొల్పటం జరిగిందని, త్వరలో కార్యాలయాన్ని ప్రారంభించటం జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరి, చెరుకుపల్లి మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కె.వెంకట కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, నాయకులు చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, అబ్దుల్ ఖుద్దూష్, లియాకత్‌భాషా, కొలుసు బాలకృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు విలువైనవి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



పారిశుద్ధ్య కార్మికులకు నూనెలు, సబ్బులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె రూరల్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు కృషి చేసే పారిశుద్ధ్య కార్మికుల రుణం ఎవరూ తీర్చలేనిదని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో పారిశుధ్య కార్మికులకు 2024–25 సంవత్సరానికి మంజూరైన యూనిఫాం, సబ్బులు, నూనెలను శనివారం ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. అంటువ్యాధులు ప్రజల దరికి చేరనివ్వకుండా పరిసరాలను పరిశుభ్రపరచటం, చెత్తనిల్వలను తొలగించటం, కాల్వలలోని మురుగు పారుదల అయ్యేలా సిల్ట్ తొలగింపులు చేయటం వంటి విధులతో నిత్యం పారిశుద్ధ్య కార్మికులు పట్టణ ప్రజలకు సేవలు అందిస్తుంటారన్నారు. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కపెట్టక ప్రజల సేవలో తలమునకలైన పారిశుద్ధ్య కార్మికులకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. గృహాల వెంబడి వచ్చే వ్యర్థాలను రోడ్లపైగాని, కాల్వలలోగాని పడవేకుండా నిర్ణీత ప్రదేశాలలో పడవేయటం, లేనిపక్షంలో పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని కోరారు. స్వచ్ఛ రేపల్లె సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పట్టణ పారిశుద్ధ్యాన్ని పరిరక్షించాలన్నారు. ఈ సందర్భంగా 153 మంది రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు యూనిఫామ్, సబ్బులు, కొబ్బరినూనెలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, వైస్ చైర్‌పర్సన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, కౌన్సిలర్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతతను కాపాడాలి

పల్లె నిద్రలో ఎస్ఐ తిరుపతిరావు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపతిరావు

నిజాంపట్నం: గ్రామస్తులు ఐక్యమత్యంతో ప్రశాంత వాతావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. మండల కేంద్రమైన నిజాంపట్నం జల్సా బజారు రామమందిరంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధికి అవసరమైన చట్టాలు తెలిసి ఉండాలన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, వాటి బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు, నేరాలకు చోటుఇవ్వరాదన్నారు. సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాతల కృషి అభినందనీయం



బాపట్ల: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎన్జీఓ సంఘం జిల్లా కోశాధికారి పానకాల రాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంఈఓ నిరంజన్ పేర్కొన్నారు. ఉప్పరపాలెం మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలులోను ఎంఈఓ నిరంజన్ శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులను పదేళ్లుగా అందిస్తున్న పానకాలరాయుడున్ని ఈసందర్భంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకురావాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు పి.వి. సాంబశివరావు, ఉపాధ్యాయులు షేక్.రఫీ, జి.ప్రసాదరావు, శ్రీమన్నారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ అరుణ, సీఆర్పీ రవికిరణ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ అవసరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాపట్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ చూపించడమే కాకుండా తరచుగా ఆరోగ్యానికి సంబంధించిన అన్ని పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. పి. ప్రసూన రాణి అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకం ద్వారా చీరాలకు చెందిన అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ సిబ్బందిచే నిర్వహించబడిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ఆరోగ్యవంతుడైన మనిషి తన లక్ష్యాన్ని సులువుగా అధిగమించగలదన్నారు. దైనందిన జీవితంలో నిత్య సంఘర్షణల వలన మానసికంగా కుంగిపోకుండా ఉండేందుకు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అందుకు వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. చీరాలలో నూతనంగా స్థాపించిన ఆధునిక అపోలో హాస్పిటల్ డాక్టర్లు వ్యవసాయ కళాశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. గైనకాలజిస్ట్ కావ్య రెడ్డి, ఆర్థోపెడిక్ డాక్టర్ రంగనాథ్ రెడ్డి, డెంటల్ డాక్టర్ సజిని మరియు జనరల్ మెడిసిన్ డాక్టర్ గోపి వర్మ తదితర వైద్యులు, వారి సిబ్బంది కళాశాల బోధన, బోధనేతర, విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స చేసి మందులివ్వడమే కాక తగు సూచనలు చేశారు. ఎన్.ఎస్.ఎస్ అధికారులు డా. కె.శ్రీనివాసులు, డా.సి.సంధ్యారాణి, డా. కె.విజయ్ ప్రకాష్, డా.విజయ కుమార్, డా. ఏజే సువర్ణలత పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

కర్లపాలెం: విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందిన సంఘటన కర్లపాలెంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రం కర్లపాలెం పంచాయతీలోని కొత్త ఇస్లాంపేట గ్రామానికి చెందిన సయ్యద్ ఆలీమా(37) శుక్రవారం తమ ఇంట్లో కరెంటు హీటర్ తీస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త రఫీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి తల్లి సూర్జహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

బాల్ బాడ్మింటన్‌లో ఎస్వీఆర్ఎం కళాశాలకు ప్రథమస్థానం



ఎస్వీఆర్ఎం కళాశాల జట్టుకు షీల్డ్‌ను అందజేస్తున్న కరస్పాండెంట్ బుచ్చియ్యచౌదరి

నగరం: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల బాల్‌బాడ్మింటన్ పురుషుల పోటీలలో శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల ప్రథమ స్థానంలో నిలిచిందని కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి చెప్పారు. గత రెండు రోజులుగా స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో జరుగుతున్న బాల్ బాడ్మింటన్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ స్థాయిలో ఆటలపోటీలను తమ కళాశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. ఫైనల్ పోటీల్లో నగరం కళాశాల జట్టు, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల జట్టు తలపడగా నగరం కళాశాల విజయం సాధించి ప్రథమమ స్థానంలో నిలవగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ, గుంటూరు ఆర్‌వీఆర్ కళాశాల తృతీయ, ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం జట్టు నాలుగో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం యూనివర్సిటీ సెలక్షన్ అబ్జర్వర్ డి.సూర్యనారయణ, కో–ఆర్డినేటర్ ఎస్.శేషగిరి, డాక్టర్ ప్రీతం ప్రకాష్ ఆధ్వర్యంలో అచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టు సెలక్షన్స్ నిర్వహించారు. సెలక్ట్ అయిన క్రీడాకారులు యూనివర్సిటీ తరపున బెంగళూర్‌లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ వి.వి.వెంకటేశ్వరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


గ్రామాల్లో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఎంపీపీ భవనం పద్మలీల



పొన్నూరు: మండల పరిధిలోని గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. రానున్న వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎంపీటీసీలు, సర్పంచులు తెలియజేసే సమస్యలను పరిగణనలోకి తీసుకుని పరిష్కారం దిశగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను వివిధ శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అంబటి రాఘవయ్య, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, హౌసింగ్ ఏఈ జాని బాష, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ విజేతలుగా వెల్లటూరు విద్యార్థులు



కలెక్టర్ చేతుల మీదుగా షీల్డ్, ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

భట్టిప్రోలు (కొల్లూరు): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో వెల్లటూరు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించడం జరిగిందని జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అరుణకుమారి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ, బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలలో పాఠశాలకు చెందిన టి. హేమకుమార్, డి.యశ్వంత్ ప్రథమస్థానం సాధించి జిల్లా స్థాయిలో విజేతలుగా నిలవడం హర్షనీయమన్నారు. విద్యార్థులు ఇరువురికి జిల్లా కలెక్టర్ వెంకటమురళి తన కార్యాలయంలో షీల్డ్‌లు, ధ్రువ పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీకృష్ణ, ఎస్కే సుభానిలను ఈసందర్భంగా ఉపాధ్యాయులు అభినందించారు.

దంత పరిరక్షణతో ఆరోగ్యం



పొన్నూరు: దంత పరిరక్షణే ఆరోగ్యానికి పునాది లాంటిదని సిబార్ డెంటల్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ ఎస్.చైతన్య మోహన్ అన్నారు. శనివారం మండలంలోని మామిళ్లపల్లి గ్రామం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంతలు ఎలా శుభ్రం చేసుకోవాలి, సమస్యలు రాగానే ఏంచేయాలనే విషయాలను వైద్యులు సౌమ్య, దివ్య, కీర్తి, రమ్య, మల్లేశ్వరి, పద్మావతి, గాయత్రి, సివెంజ్, ఆశ్రిత వివరించారు. విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, దంత సమస్యలను గుర్తించిన వారికి ఉచిత ఓపీ క్యాంప్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.బాలస్వామి, డాక్టర్ సిహెచ్.రమేష్ పాల్గొన్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం పటిష్టం



గుంటూరు రూరల్: యోగాసనాలతో ఆరోగ్యం పటిష్టంగా మారుతుందని శ్రీ సాయి యోగా విద్యాపీఠం యోగాచార్య బైసు మల్లికార్జునరావు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు యోగాసనాలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాచార్య విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ విద్యార్థి దశలో యోగా చేయటం వల్ల వారిలో సృజనాత్మకత, జ్ఞాపకశక్తి, సొంతగా నిర్ణయం తీసుకునే శక్తి లభిస్తుందన్నారు. అనంతరం అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం



పొన్నూరు: పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజా సిద్ధార్థ అన్నారు. శనివారం పట్టణంలోని ఒక కల్యాణ మండపంలో అసోసియేషన్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజా సిద్ధార్థ, డాక్టర్ సజ్జా రవీంద్రబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు యలమందరావు, కార్యదర్శి రవిచంద్రారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్‌పీ రాజేంద్రప్రసాద్, గౌరవాధ్యక్షుడు ఎంవీ మోహనరావు పాల్గొన్నారు.